క్లుప్తంగా

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు



సాయిబాబాకు హారతి సమర్పిస్తున్న అర్చకుడు

కంచరపాలెం: స్థానిక 104 ఏరియా బాపూజీనగర్‌లోని షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం అనువంశిక ధర్మకర్త ఎడ్ల శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రధాన అర్చకుడు సూర్యప్రకాష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా విగ్రహానికి భక్తులు క్షీర, విభూది అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం ప్రత్యేక హారతులతో పూజించి, సాయిబాబాను పల్లకీలో ఊరేగించారు. కమిటీ సభ్యులు ఆంజనేయులు, ప్రభాకర్, పైడిరెడ్డి, వసులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కృష్ణాలయంలో లలితా పారాయణం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్ల వీధిలోని శ్రీకృష్ణాలయంలో గురువారం స్థానిక మహిళలు లలితా పారాయణ పఠించారు. శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 20 మంది మహిళలు, 12 మంది చిన్నారులు శ్రీకృష్ణుడి గీతాలు ఆలపించారు. అనంతరం గోవింద నామాలు, లలితా పారాయణ, విష్ణు పారాయణాలను పఠించారు. ప్రతి ఒక్కరిలో దైవ చింతన ఉండాలనే ఆలోచనతో వారంలో మూడు రోజులు మందిరం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంఘ ప్రతినిధులు తెలిపారు.

కాళీ కాలభైరవుల కల్యాణోత్సవం నేడు

సీతంపేట: భాద్రపద పౌర్ణమి సందర్భంగా లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కాళీ కాలభైరవుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కుర్తాళం శంకరాచార్య, శ్రీలలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి దివ్య సమక్షంలో కల్యాణం జరుగుతుందన్నారు. పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ప్రజలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష



89వ వార్డు ఆదర్శనగర్‌లో పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

గోపాలపట్నం : ప్రజల ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని, దానికి నిదర్శనమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అని ప్రజలు చెబుతున్నారు. జీవీఎంసీ 89వ వార్డు ఆదర్శనగర్‌లో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, సచివాలయ హెల్త్ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ఫీవర్, బీపీ పరీక్షించి ఆయా వివరాలు నమోదు చేస్తున్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి పరీక్షలు చేయడం ఇన్నేళ్లుగా ఎప్పుడూ చూడలేదని స్థానికులు చెప్పుకుంటున్నారు. ప్రజల పట్ల ప్రభుత్వానికి ఇంత ఆదరణ ఉండటం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

61వ వార్డులో ఫాగింగ్



దోమల మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలోని పలు ప్రాంతాల్లో మలేరియా సిబ్బంది గురువారం ఫాగింగ్ చేశారు. మల్కాపురం పల్లివీధి, గొల్లవీధి, గాంధీజీ వీధి, నగరాల వీధి, జాలరవీధి, మార్కెట్ లైన్ తదితర ప్రాంతాలలో సిబ్బంది దోమల మందును పిచికారీ చేశారు.

'మరుగు' కష్టాలు ఇక చెల్లు

- ఎస్‌ఏడీ జంక్షన్‌లో నూతన మరుగుదొడ్ల నిర్మాణం
- జీవీఎంసీ నిధులతో అందుబాటులోకి..
- ప్రయాణికులకు తీరనున్న ఇబ్బంది



బస్ట్ షెల్టర్‌కు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లు



ఎన్‌ఏడీ కూడలిలోని బస్ షెల్టర్

విశాఖ విద్య: నగరంలో ఎన్‌ఏడీ కూడలి నిరంతరం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి వైపు నుంచి ఆర్టీసీ బస్సుల్లో వచ్చే ప్రయాణికులు సింహాచలం, పెందుర్తి వైపు, అదే విధంగా ఎన్‌ఏడీ పరిసర కాలనీలకు చెందిన వారు ఇక్కడనే బస్సులు దిగుతారు. ఆయా ప్రాంతాలకు వెళ్లే వారు సైతం ఇక్కడనే బస్సులు ఎక్కేందుకు వేచి ఉంటారు. ఈ నేపథ్యంలో ఎన్‌ఏడీ కూడలి మీదగా రేయింబవళ్లు ప్రయాణికుల రాకపోకలు సాగుతాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఎన్‌ఏడీ సెంటర్‌లో మరుగుదొడ్లు అందుబాటులో లేక ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యేవారు. ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు చెప్పనలవి కావు. గురుజాడ నగర్ వద్ద గ్రీన్ బెల్ట్ ప్రాంగణంలో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ శిథిలావస్థకు చేరాయి. దీనికి తగిన మరమ్మతులు చేపట్టి, వినియోగంలోకి తీసుకొచ్చేందుకు గత పాలకులెవ్వరూ పెద్దగా పట్టించుకోలేదు.

52, 90వార్డులకు మధ్యలో ఉండే ఎన్‌ఏడీ కూడలిలో ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణం ఆవశ్యకతను గుర్తించిన డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దీనిపై జీవీఎంసీ అధికారులతో చర్చించారు. మహిళా ప్రయాణికులకు మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తించిన జీవీఎంసీ కమిషనర్, మేయర్ ఇందుకు సానుకూలంగా స్పందించారు.

రూ.13 లక్షలతో అధునాతనంగా..

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రాతినిధ్యంతో రూ.13 లక్షలతో అధునాతన రీతిలో మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టారు. పురుషులకు మూడు, మహిళా ప్రయాణికులు వినియోగించుకునేందుకు వీలుగా మరో మూడు మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ పనులు ఈ పూర్తికావొచ్చాయి. భవిష్యత్‌లో అక్కడ పారిశుధ్య సమస్య తలెత్తకుండా మరుగుదొడ్ల చుట్టూ నాపరాయి అమర్చుతున్నారు. మరుగుదొడ్ల వినియోగంలో నీటి సమస్య లేకుండా తగిన ఏర్పాట్లు చేశారు. మరికొన్ని రోజుల్లోనే దీన్ని వినియోగంలోకి తీసుకొచ్చేలా జోన్ 5 ఇంజినీరింగ్ విభాగం డిప్యూటీ ఈఈ ఏడు కొండలు పర్యవేక్షణలో పనులు శరవేగంగా చేస్తున్నారు.

ఇన్నాళ్లకు తీరిన సమస్య

ఎన్నో ఏళ్లుగా ఎన్‌ఏడీ కూడలిలో సరైన మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇన్నాళ్లకు సమస్య తీరనుందని అక్కడ విధులు నిర్వహించే ఆర్టీసీ గైడ్ రమణ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎన్‌ఏడీ కూడలిలో భవిష్యత్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు శ్రద్ధ తీసుకుంటున్నామని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ 'సాక్షి'కి తెలిపారు. దీనిపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాషువాకు ఘన నివాళి



జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్య అతిథులు, నాయకులు, సంఘ సభ్యులు

కంచరపాలెం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కంచరపాలెం జాషువానగర్‌లోని జాషువా కళా ప్రాంగణంలో ఆయన విగ్రహానికి సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు పూర్వ వీసీ ఆచార్య జార్జ్ విక్టర్, అంబేడ్కర్ మిషన్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణ్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జార్జ్ విక్టర్ మాట్లాడుతూ కుటిల కులతత్వం, మతోన్మాద దారిద్ర్యంపై స్వానుభవం ఉన్న గుర్రం జాషువా వాటిని రూపుమాపేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్.అప్పారావు, టీడీపీ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, యాదవ సంఘం ప్రతినిధి నమ్మి అప్పల సత్యనారాయణ, కళా ప్రాంగణం గౌరవ అధ్యక్షుడు గొటువాడ నర్సింగరావు, అధ్యక్షుడు అలమండ ప్రసాద్, కార్యదర్శి గుమ్మడి ఆదినారాయణమూర్తి, కోశాధికారి గుమ్మడి అచ్చిబాబు, జి.వి.రమణ, నాయకులు సోడదాసి సుధాకర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు కణితి సాధురావు తదితరులు పాల్గొన్నారు.

మూడు కిలోల గంజాయితో ముగ్గురి అరెస్ట్

గోపాలపట్నం: గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద మూడు కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఈమేరకు గోపాలపటనం పోలీసులు తెలిపిన వివరాలిలా.. గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద గంజాయి తరలిస్తున్నట్లు స్పష్టమైన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వేచి ఉన్నారు. వారిని చూసి తప్పించుకునే యత్నంలో ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. బెంగుళూరుకు చెందిన దీప్ దర్శన్, శివలింగ ప్రసన్, అరకు ప్రాంతానికి చెందిన వంతల గిన్నులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 3 కిలోల గంజాయితోపాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. వారు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డుపై 'కీప్ లెఫ్ట్' సూచికల ఏర్పాటు



తాటిచెట్లపాలెం హైవేపై కీప్ లెఫ్ట్ మార్క్ వద్ద జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, సీఐ అప్పారావు

మద్రిపాలెం: కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలు నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి దాటాక తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద కీప్ లెఫ్ట్ లెటర్స్, యారో మార్క్ పెయింటింగ్స్ వేశారు. జాతీయ రహదారిపై అందరూ లేన్ డిసిప్లిన్ తప్పక పాటించి, ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని ఏసీపీ సూచించారు. చిన్న వాహనాలు ఎడమ వైపు ప్రయాణించాలనే విధంగా పెయింటింగ్‌తో వాహన చోదకులకు సూచించారు. బీఆర్‌టీఎస్ రోడ్డుపై కూడా ఈ ప్రక్రియ మొదలుపెడతామని ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. కియా షోరూం సీఈవో శ్రీనివాసరావు, మేనేజర్ నరేష్ సౌజన్యంతో పెయింటింగ్స్ సమకూర్చామని సీఐ చెప్పారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రధాన కూడళ్లలో ఈ సూచికలు ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్ల వీధిలో గురువారం రాత్రి స్థానిక మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా యాదవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద పోటీలు జరిగాయి. సుమారు 60 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని వివిధ రంగులతో ముగ్గులు వేశారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యాదవ్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం భగత్‌సింగ్



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న డీవైఎఫ్‌ఐ ప్రతినిధులు

మల్కాపురం: భగత్‌సింగ్ సాహస పోరాటం యువతకు ఆదర్శమని నాయకులు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద, 61వ వార్డు మల్కాపురం ప్రాంతాల్లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక నాయకుడు ఏసుబాబు భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి అతి చిన్నవయసులోనే ప్రాణ త్యాగం చేసిన భగత్‌సింగ్ చిరస్మరణీయుడన్నారు. కార్యక్రమంలో నాయకులు, స్థానిక యువత పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

విశాఖ విద్య: ఎన్‌ఏడీ కూడలి బాజీ జంక్షన్ పశువైద్యశాలకు సమీప రహదారిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. సంతకు వెదురుబొంగులను విక్రయించేందుకు తీసుకొచ్చేవారు ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకొని పెడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని అటుగా వెళ్లేవారు భయాందోళన చెందుతున్నారు. దీనిపై ట్రాన్స్‌కో, జీవీఎంసీ అధికారులు స్పందించి, ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చిత్రకళా పోటీలకు విశేష స్పందన



చిత్రకళా పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

డాబాగార్డెన్స్ : చోడవరం చిత్రకళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ అఖిలభారత చిల్డ్రన్ ఆర్ట్ పోటీలకు విశేష స్పందన లభించింది. ప్రేమసమాజం మినీ హాల్ వేదికగా గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన చిత్రకళా పోటీల్లో వందలాది మంది విద్యార్థులు పాల్గొని వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీశారు. ఈ సందర్భంగా చోడవరం చిత్రకళా నిలయం వ్యవస్థాపక కార్యదర్శి బొడ్డేటి సూర్యనారాయణ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా చిత్రకళా పోటీలు నిర్వహిస్తూ ఎంతో మంది చిత్రకారులను సమాజానికి పరిచయం చేశామన్నారు. ఏడాదికోసారి ఇటువంటి పోటీలు నిర్వహిస్తూ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, సమాజానికి చిత్రకారులను అందిస్తున్నట్లు తెలిపారు. తన వద్ద శిక్షణ పొందిన అనేక మంది చిత్రకారులుగా.. డ్రాయింగ్ టీచర్లుగా రాణిస్తున్నారని చెప్పారు. ఈ పోటీలకు దేశం నలుమూలల నుంచి ఎంట్రీలు వచ్చాయన్నారు. పిల్లలకు నచ్చిన అంశాన్నే ఎంచుకుని డ్రాయింగ్ వేయించామన్నారు. పిల్లల్ని ప్రోత్సహించేందుకు పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల విజేతలకు నవంబర్ 4న చోడవరంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని చెప్పారు.

హైవేపై పల్టీలు కొట్టిన కారు



ప్రమాదంలో నుజ్జయిన కారు

మద్రిపాలెం: కంచరపాలెం జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం పెద్ద ప్రమాదం తప్పింది. తాటిచెట్లపాలెం హైవే మీదుగా కంచరపాలెం వైపు వస్తున్న కారును వెనుక నుంచి వస్తున్న లారీ అధిగమించే క్రమంలో ఒక్కసారిగా తగలడంతో.. కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. కారులో ఉన్న ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడ్డ ఇద్దరు మహిళలను చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తిక్కవానిపాలెం వాడపేటలో అమ్మమ్మతో కలిసి నివసిస్తున్న వాసుపల్లి రోహిత్‌కుమార్(11) సీతమ్మధారలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు బస్సు కోసం అమ్మమ్మతో కలిసి రోడ్డు మీద వేచి ఉండగా.. తాటిచెట్లపాలెం నుంచి బిర్లా వైపు సర్వీస్ రోడ్డులో వేగంగా వస్తున్న బైకు బాలుడిని ఢీకొనడంతో కుడి భుజానికి గాయమైంది. గురువారం బాలుడి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్‌కానిస్టేబుల్ మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

వైవీ సుబ్బారెడ్డికి ఘన స్వాగతం



వైవీ సుబ్బారెడ్డికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గోపాలపట్నం : వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. విశాఖ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, బర్కత్ ఆలీ, కె.కె. రాజు, జాన్ వెస్లీ, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ తదితర నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఆయన విమానాశ్రయం నుంచి నగరానికి బయలుదేరి వెళ్లారు.

గణపతికి ప్రత్యేక పూజలు.. దీపారాధనలు



మల్కాపురం గొల్లవీధిలో దీపారాధన



ఆర్‌కేపురం వద్ద దీపారాధన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం : వినాయక చవితి మహోత్సవాలలో భాగంగా 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద స్థానిక యాదవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్వామిని సుగంధ పుష్పాలతో అలంకరించి, కుంకుమార్చన చేశారు. సాయంత్రం స్థానిక మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండపం నుండి హనుమాన్ ఆలయం వరకు కనుల పండువగా దీపారాధన చేపట్టారు. అనంతరం ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన మహిళలకు బహుమతులు, వినాయకుని చిత్రపటాలు బహూకరించారు. అదే విధంగా ఇదే వార్డుకు చెందిన ఆర్‌కేపురం వద్ద గౌరీదేవి ఆలయం వద్ద నెలకొల్పిన గణనాథుని మండపం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా దీపారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొని దీపారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భారీ అన్నసమారాధనలు



ఏకేసీ కాలనీలో అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు, సీఐ దేముడుబాబు



62వ వార్డులో అన్నదానం చేస్తున్న మజ్జి మాలినాయుడు

సింధియా: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం పలు చోట్ల భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదానాన్ని ముఖ్య అతిథులు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, మల్కాపురం సీఐ దేముడు బాబు ప్రారంభించి అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- 62వ వార్డు దుర్గానగర్‌లో స్టార్ దుర్గా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ముఖ్య అతిథి పారిశ్రామిక వేత్త మజ్జి మాలినాయుడు ప్రారంభించారు. ముందుగా గణపతికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. నర్సింగరావు, ఈశ్వరరావు, రమణ, వెంకటస్వామి, సునీల్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింల శాంతి ర్యాలీ



జాకీర్‌హుస్సేన్ నగర్ మసీద్ వద్ద శాంతి ర్యాలీ ప్రారంభిస్తున్న ముస్లింలు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డులో మహమ్మద్ ప్రవక్త జన్మదినం ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మద్రిపాలెం మస్జిద్ ఈ అల్ పతా, జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జిద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో నాతేకలంలు ఆలపిస్తూ ముస్లిం మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ చేశారు. పాత పోస్టాఫీస్ వద్ద ఇసాక్ మదీనావలీ మజార్ షరీఫ్ వరకు ర్యాలీగా వెళ్లి మజార్ వద్ద చాదర్(పవిత్ర వస్త్రం) సమర్పించామని కమిటీ సభ్యులు తెలిపారు. అంతకముందు ముస్లింలు మసీద్ ప్రాంగణంలో ఖురాన్ పఠించి ప్రత్యేక నమాజ్‌లు ఆచరించి ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని సన్మార్గంలో నడుస్తూ ఆయన బోధనలను సార్థకం చేయాలని మత గురువులు హితవు పలికారు.

ప్రజల్లోకి కేంద్ర ప్రభుత్వ పథకాలు



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మాధవ్

విశాఖ విద్య: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రవాస్ యోజన ఇన్‌చార్జి పీవీఎన్ మాధవ్ అన్నారు. బీజేపీ ఎన్‌ఏడీ మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు గొట్టివాడ వెంకటేశ్వరరావు నేతృత్వంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, మండల బాధ్యులతో ఆయన సమీక్షించారు.

బీజేపీ బలోపేతం కోసం బూత్ కమిటీలు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పురుషోత్తమ్ రమేష్, చంద్రశేఖర్ రాజు, సురేష్, కృష్ణారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనామృతం

సీతంపేట: శారదా స్వర సంగమం, అన్నమయ్య స్వర అకాడమీ సంయుక్తంగా గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనామృతం ప్రేక్షకులను అలరించింది. గాయకులు, లెఫ్టినెంట్ లోకేష్ పర్యవేక్షణలో సుజన, ఉమాదేవిలు వారి శిష్య బృందంతో కలిసి అన్నమయ్య మధుర గీతాలను ఆలపించారు. లోకేశ్ పాడిన కలగంటి కలగంటి, బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే, గోవింద గోవింద కీర్తనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో గాయనీ గాయకులను ఎస్.విజయ్‌కుమార్, చెన్నా తిరుమలరావు, భయ్యా శ్రీనివాస్, శారద, ఎం.ఎస్.మాధవ్ ప్రోత్సహించారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే సహించం

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించనివ్వబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 959వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన డబ్ల్యూఎండీ, యుటిలిటీస్, అడ్మిన్, టౌన్‌షిప్ అడ్మిన్ విభాగాల కార్మికులు పాల్గొని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్తారన్నారు.